# ధాన్యం కొనుగోళ్లలో సర్కారు విఫలం

## మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



### వడ్లు మొలకెత్తినా కొంటలేరు

### సిద్దిపేట జిల్లా రూరల్ మండలం ఇరోడు

### ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం పరిశీలన

**సిద్దిపేట, మే 7 సిరి న్యూస్ః**

ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ సీఎం రేవంత్‌రెడ్డికి అన్నదాతలపై లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం సిద్దిపేట జిల్లా రూరల్ మండలంఇరోడులోని ఐకేపీ కేంద్రం లో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అక్కడి నుంచే కలెక్టర్, ఆర్డీవో, సివిల్‌సప్లయ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి పాలన చేతకాకపోతే దిగిపోవాలని హితవు పలికారు. నేడు రాష్ట్రంలో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఉందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనేదికులేక రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. హైదరాబాద్‌లో కూర్చొని అందాల పోటీలపై రేవంత్‌రెడ్డి సమీక్షలు చేస్తున్నాడని, అన్నదాతల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అప్పులు పుట్టడం లేదని మాట్లాడటం అంటే సీఎంగా ఫెయిల్ అయ్యారనే అర్థమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం గన్నీ బ్యాగులు ఇచ్చే పరిస్థితిలో లేదన్నారు. రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు తగ్గించి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించి సమస్యలు పరిష్కరించాలన్నారు. బీఆర్ఎస్ పదేండ్లలో కరోనా వచ్చినా, నోట్ల రద్దు అయినా ఏరోజు కూడా రైతులకు రైతుబంధు ఆపలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిందన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ధాన్యం కొనుగోలులో ఎన్నడూ ఇంత ఆలస్యం జరగలేదని, కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం రైతుల నుంచి తరుగు పేరుతో 5కేజీల ధాన్యం కట్ చేస్తుందని మండిపడ్డారు. కొనుగోలు చేయడంలో ఆలస్యం కావడం వల్ల వర్షాలు పడి ధాన్యం మొలకెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు వర్షాలకు దెబ్బతిన్న కూరగాయలు, మామిడి పంటలు వేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే 43సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. మంత్రుల గాలిమోటర్ల ప్రయాణాలు తప్పా ఏం సాధించారో చెప్పాలన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేసేందుకు రెవెన్యూ అధికారులు పర్యటించాలని సూచించారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, నాయకులు విజేందర్‌రెడ్డి, చిట్యాల సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

## దేశం కోసం మహారుద్రయాగం..!

### సైనికులకు మద్దతుగా ర్యాలీ

**ఝరాసంగం మే 7 సిరి న్యూస్ :**



దేశం సురక్షంగా ఉండాలని, లోక కళ్యాణం కోరుతూ ఝరాసంగం మండల పరిధిలోని బర్దిపూర్ దత్త క్షేత్రంలో చేపట్టిన మహా రుద్రయాగం 10వ రోజుకు చేరుకుంది. బుధవారం ఆలయంలో ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర్ సిద్దేశ్వరానందగిరి, అవధూత గిరి మహారాజ్ ఆధ్వర్యం లో ఉదయం గోపూజ, గణపతి పూజ, జ్యోతిర్లింగాలకు రుద్రాభిషేకం,మహా రుద్ర యజ్ఞం ప్రారంభించి పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు మాట్లాడుతూ రాక్షస పీడ నుండి దేశం విముక్తి పొందాలని, దేశాన్ని రక్షిస్తున్న సైనికుల సంక్షేమాన్ని కోరుతూ చేపట్టిన మహా రుద్రయాగం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. . సాయంత్రం వైదిక పాఠశాల విద్యార్థులు దేశ సైనికులకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి మాత జయంతి వేడుకలు

**నారాయణఖేడ్ మే 7 సిరి న్యూస్**



నారాయణఖేడ్ పట్టణంలో వాసవిమాత జయంతి వేడుకలను బుధవారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా సామూహిక కుంకుమార్చనలు, డోలారోహణం, వాసవి పత్రాలు, లలిత సహస్ర పారాయణం తదితర కార్యక్రమాల ను పురోహితులు మోహన్ జోషి, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాత జీవిత వృత్తాంతాన్ని వివరించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ఒడి బియ్యం సమర్పించి మంగళహారతి నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహా ప్రసాదాన్ని అందించారు. కాగా పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ రావి ఆకుపై రూపొందించిన వాసవి మాత చిత్రపటానికి ఈ సందర్భంగా ఆర్యవైశ్యసంఘం నాయకులు ఆవిష్కరించారు.

## ఘనంగా ఎల్లమ్మ తల్లి జాతర

**హత్నూర, 07 మే సిరి న్యూస్:**



హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలో ఎల్లమ్మ తల్లి జాతర గత నాలుగు రోజులు నుండి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ప్పటికీ, బుధవారం దౌల్తాబాద్‌లో గతనాలుగు రోజుల నుండి జరుగుతున్న ఎల్లమ్మ తల్లి జాతరలో భాగంగా చివరి రోజు బుధవారం ఆలయ పూజారి రాజు స్వామి గౌడ్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి నాగవెల్లి పటం వేసి అమ్మవార్లకు శివసత్తుల మధ్య పటం వేసి భారీ జన సందోహం మధ్య జాతర ముగించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భారీ ఎత్తున తరలివచ్చారు.

## సాయిబాబా ఆలయానికి బోరు మోటారు అందజేత

**నారాయణఖేడ్, మే 7 సిరి న్యూస్**



నారాయణఖేడ్ పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయానికి రూ.70 వేల విలువ గల బోర్ మోటర్, ఇతర సామగ్రిని పట్టణానికి చెందిన విరామ హాస్టల్ వెల్ఫేర్ అధికారి త్వర్ల వీరయ్య కుటుంబ సభ్యులు వితరణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయ పురోహితులు మోహన్ జోషి, రమేష్ జోషిలు పూజా కార్యక్రమాలు నిర్వహించి బోరు మోటార్‌ను ప్రారంభించారు. ఆలయంలో బోరుబావికి మోటార్ సామాగ్రి అవసరం కావడంతో సేవా దృక్పథంతో వితరణ చేసనందుకుఆలయ కమిటీ బాధ్యులు వీరయ్యను ఘనంగా సన్మానించారు. కాగా ఆలయ అభివృద్ధి కి దివంగత నామ ప్రభాకర్ కుమారుడు వెంకటేశం రూ,25 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవిమాతకు నిర్మల జగ్గారెడ్డి ప్రత్యేక పూజలు

**సదాశివపేట,మే 7 (సిరి న్యూస్)**



శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిజయంతోత్సవం సందర్భంగా సదాశివపేటలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమెమాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే అమ్మవారు శ్రీ వాసవి మాత అని అన్నారు. శ్రీ వాసవి మాత దయవల్ల సకాలంలో వర్షాలు కురిసే పాడిపంటలతో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని కోరుకో వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.